క్లుప్తంగా

నేడు ఆకేపాటి నామినేషన్



రాజంపేట : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. మన్నూరు (పట్టణశివారు)లో ఉన్న యల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ఉదయం 9గంటలకు ర్యాలీగా రాజంపేట సబ్ కలెక్టరేట్ వరకు వెళ్లనున్నారు. ర్యాలీకి పెద్దఎత్తున పార్టీ క్యాడర్, అభిమానులు, ప్రజలు తరలిరానున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ఆకేపాటి నామినేషన్ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, కడప మేయరు సురేష్ బాబు తరిలిరానున్నారు.

రామాలయానికి భూమిపూజ

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు, కమ్మపల్లి దళితవాడలో నూతనంగా నిర్మించనున్న రామాలయం భూమిపూజ కార్యక్రమంలో ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి బుధవారం పాల్గొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు నాగినేని రమేష్ నాయుడు తన సొంత నిధులతో కమ్మపల్లి దళితవాడలో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆలయ నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్మాణ కార్యక్రమాలను ప్రారంభించారు.

చెంగల్‌రెడ్డికి నివాళి



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న కొరముట్ల

ఓబులవారిపల్లె : ఏపీఎండీసీ ఉద్యోగి, ముఖ్యమంత్రి సలహాదారుడు ఆర్.ధనుంజయ రెడ్డి సోదరుడు రక్కాసి చెంగల్‌రెడ్డి(46)కి బుధవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు ఘనంగా నివాళులర్పించారు. ఏపీఎండీసీలో పనిచేస్తున్న రక్కాసి చెంగల్‌రెడ్డి గత నెల రోజులుగా అనారోగ్యంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అంత్యక్రియలను బుధవారం అనంతరాజుపేట స్వగ్రామంలో నిర్వహించారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కె.అజయ్‌రెడ్డి, సాయికిషోర్ రెడ్డి, పి.సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, పుల్లంపేట ఎంపీపీ బాబుల్ రెడ్డి, ముప్పాల హేమనవర్మ, జి.సుధాకర్ రాజు, నాయకులు తదితరులు నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను, ధనుంజయరెడ్డిని వారు పరామర్శించారు.

పార్టీ వీడిన వారు పదవులకు రాజీనామా చేయాలి

సిద్దవటం : వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో పదవులు పొంది ఎన్నికల తరుణంలో పార్టీ మారిన వారు తమ పదవులకు రాజీనామా చేయాలని వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు జ్యోతి జగదీష్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ ఖాజాపీరాన్, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్ వంటి నాయకులు వైఎస్ఆర్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లారన్నారు. పార్టీ మారినప్పుడు వైఎస్ఆర్‌సీపీలో పొందిన పదవులు వారికి ఎందుకని ఆయన ప్రశ్నించారు. వైఎస్ఆర్‌సీపీ నుంచి ఇతర పార్టీలోకి వెళ్లిన వారు తక్షణమే పదవులకు రాజీనామా చేయాలన్నారు. పార్టీని వీడి పదవులను అంటి పెట్టుకునేందుకు వారికి సిగ్గుండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకుడు నిమ్మకాయల ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

చిన్నమండెం : ఎంతటి వారైనా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చిన్నమండెం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ శ్రీనివాసపురంలో బందోబస్తు చేపట్టారు. ఇటీవల ఆ గ్రామంలో జరిగిన ఘర్షణలను దృష్టిలో ఉంచుకుని ఈ బందోబస్తును చేపట్టినట్లు ఎస్ఐ చెప్పారు. ఆయన వెంట పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రచారంలో మోహన్‌రెడ్డి

రామాపురం : సరస్వతిపల్లె గ్రామంలో బుధవారం ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. సంక్షేమం, అభివృద్ధిలో టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఉన్న తేడా గమనించాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకున్నాం. ఇచ్చిన హామీలలో ఒక్కటైనా చంద్రబాబు అమలు చేశారా అంటూ మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ మీ అమూల్యమైన ఓటును వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

చిన్నమండెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో కడపకు చెందిన శ్రీసాయి నర్సింగ్ హోం ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ఉచిత మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ మాధవిచే పరీక్షలను నిర్వహించనున్నారు. ఆపరేషన్లు అవసరమైన వారికి ఐఓఎల్ మధురై వారిచే కంటి ఆపరేషన్ ఉచితంగా జరిపిస్తామని పేర్కొన్నారు. వైద్య శిబిరానికి వచ్చేవారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్‌కార్డు ఒరిజినల్ తప్పక తెచ్చుకోవాలని సూచించారు.

ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

పుల్లంపేట : బుధవారం శ్రీరామ నవమిని పురస్కరించుకొని మండలంలోని రెడ్డిపల్లి, అనంతంపల్లి, రంగంపల్లి, పుల్లంపేట, రామక్కపల్లి, దళవాయిపల్లి తదితర గ్రామాలలో వేకువజాము నుంచే జై శ్రీరామ్ నినాదాలు ఆలయాలు మార్మోగాయి. ఉదయం అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు స్వామివారికి నిర్వహించారు. అనంతంపల్లిలోని శ్రీరామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలు స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. అలాగే కోటగడ్డపై వెలసిన ఉన్న శ్రీ అభయాంజనేయస్వామికి, దళవాయిపల్లిలోని శ్రీ పంచముఖ అభయాంజనేయస్వామికి శ్రీరామ నవమి సందర్భంగా పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాన్ని గ్రామోత్సవం నిర్వహించారు.



సిద్దవటం: సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు

ఘనంగా సీతారాముల కల్యాణం

నందలూరు (రాజంపేట) : సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మండలంలోని ఇసుకపల్లి గ్రామంలో వెలసిన భద్రాద్రి రామాలయంలో, కుమ్మరపల్లిలోని రామాలయంలో, ఆల్విన్ ఫ్యాక్టరీ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం వృషభలగ్నంలో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఇసుక పల్లెలోని శ్రీ భద్రాద్రి రామచంద్రస్వాముల వారి కల్యాణం బ్రహ్మశ్రీ బందాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో జరిపించారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులతో ప్రాంగణం కిటకిటలాడింది. ఉభయదాతలుగా పసుపులేటి సుబ్రమణ్యం దంపతులు, పసుపులేటి దుర్గా ప్రవీణ్ కుమార్ దంపతులు వ్యవహరించారు. అదే విధంగా కుమ్మరపల్లె గ్రామంలో ఎల్లటూరు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు.

రామాపురంలో..

రామాపురం : సకల గుణాభిరాముడు, పితృవాక్య పరిపాలకుడు శ్రీరాముని ఆశీస్సులతో, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డిలు ఆకాంక్షించారు. రామాపురం మండలం సుద్దమళ్ల గ్రామం ఎర్రంరెడ్డిగారిపల్లెలోని రామాలయంలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో వారు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవోపేతంగా సీతారాముల కల్యాణంను నిర్వహించారు. శ్రీరాముడి కరుణా కటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించారు.



రామాపురం: పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి దంపతులు



రైల్వేకోడూరు: శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల, కొల్లం గంగిరెడ్డిలు

సంబేపల్లెలో..

సంబేపల్లె : శ్రీరామనవమి మహోత్సవం సంబేపల్లెలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సీతారామ ఉత్సవ విగ్రహాలకు కల్యాణాన్ని జరిపారు. ఈ సందర్భంగా పురోహితులు పితృవాక్ పరిపాలకుడైన శ్రీరామచంద్రుని గుణగణాలను వివరించారు. ప్రస్తుత సమాజంలో శ్రీరాముని ఆదర్శంగా తీసుకొని ఉన్నతమైన భావాలు ఆధ్యాత్మిక చింతనతో జీవించాలని తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాలలో సీతారాముల కల్యాణోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లి టౌన్ పరిధిలోని రామాలయంలో అర్చకులు వెంకటనారాయణ శాస్త్రీ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా జరిపారు. చింతకుంటవాండ్లపల్లె, కోనంపేట, దిన్నెపాడు, మద్దిరేవుల తదితర గ్రామాలలో సీతారాముల కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకం అందజేసి దాత సహకారంతో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణ ఆంజనేయుడి ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించారు. చెక్కభజన, కోలాట భజనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సిద్దవటం : మండలంలోని మాచుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఉక్కాయపల్లి గ్రామంలో బుధవారం శ్రీరామ నవమి పండుగ సందర్భంగా రామాలయం వద్ద సీతా రాముల ఉత్సవమూర్తులకు వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి కల్యాణ మహోత్సవంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో వేద పండితులు ప్రదీప్‌శర్మ, వేదమంత్రాలతో మంగళ వాయిద్యాల నడుమ కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు గ్రామ పెద్దలు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి శివయ్య, కుటుంబ సభ్యులు సహకరించారు.

చిట్వేలిలో..

చిట్వేలి : శ్రీరామ నవమిని పురస్కరించుకొని బుధవారం మండలంలోని అన్ని శ్రీరామాలయాలలో నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే జై శ్రీరాం నినాదాలతో ఆలయాలు మార్మోగాయి. ఉదయం అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. చిట్వేలి శింగనమల వీధిలో వెలసిన శ్రీరామాలయంలో ఉదయం ధ్వజారోహణ, అభిషేకం, పూజలు జరిపారు. ఉభయదాతలు పూజలు చేసి తీర్థప్రసాదాలు అందించారు. స్థానిక బ్రాహ్మణ వీధిలో భక్తాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : శ్రీ రామ నవమి సందర్భంగా పలు రామాలయాలలో శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. బుధవారం రాయచోటి పట్టణంలోని రెడ్డీస్ కాలనీ, ఎన్‌జీఓ కాలనీలో ఘనంగా వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ కనుల పండువగా స్వామి వారి కల్యాణం జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కల్యాణోత్సవం కార్యక్రమానికి బత్తిరాల వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులు కావలి లక్ష్మీదేవి కావలి వెంకట సుబ్బారెడ్డిలు సహకరించారు. అలాగే భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదం వెంకట్రామిరెడ్డి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల వ్యాప్తంగా శ్రీ రామనవమి సందర్భంగా ఆలయాలలో సీతారాముల కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలను పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ఆలయ అర్చకుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ క్రతువును జరిపారు. పలువురు భక్తులు పాల్గొనగా తీర్థ ప్రసాదాలను ఆలయ అర్చకులు అందజేశారు.

ఈటమాపురంలో..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండల పరిధిలోని రాజుపాలెం, ఈటమాపురం గ్రామాలలో సీతారాముల కల్యాణం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. రాజుపాలెంలో ఆలయ చైర్మన్ వెంకటరాజు, గ్రామస్తులు కలిసి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం మధురాజు ఏర్పాటు చేశారు. అలాగే ఈటమాపురంలో రాత్రి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మండలంలోని ప్రతి గ్రామంలోని రామాలయాలలో ప్రత్యేక పూజలు చేసి పానకం, గుగ్గిళ్లను పంపిణీ చేశారు.



చిన్నమండెంలో కల్యాణ క్రతువు దృశ్యం



లక్కిరెడ్డిపల్లె మండల కేంద్రంలో..

గాలివీడులో..

గాలివీడు : మండల వ్యాప్తంగా శ్రీరామనవమి వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. గాలివీడు గేటు నాలుగు రోడ్ల కూడలిలోని కోదండ రామాలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని నాగ ఫణి కిషోర్ శర్మ పూజలు జరిపారు. పెద్దూరు బ్రాహ్మణవీధి వేంకటేశ్వర స్వామి ఆలయంలో విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. ఆలయంలో కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తాదులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

పూజల్లో పాల్గొన్న కొరముట్ల

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండల వ్యాప్తంగా బుధవారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఓబనపల్లెలోని రామాలయంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాఘవరాజుపురంలో జరిగిన స్వామివారి కళ్యాణంలో పాల్గొన్నారు. శ్రీరాముని ఆశీస్సులు అందరిపై ఉండి రాబోయే రోజుల్లో అందరికి శుభం కలగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు రామరాజ్యాన్ని అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై ఆ దేవుడి దయ ఉండాలని ప్రార్థించారు. పూజల్లో కొల్లం గంగిరెడ్డి, హేమనవర్మ, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, స్థానిక నాయకులు శివారెడ్డి, రవి, శ్రీనివాసులరెడ్డి, మోహన్‌రెడ్డి, ధనుంజయనాయుడు, కాకర్ల నాగేశ్వరనాయుడు, సుబ్బరాయుడు, శ్రీనాథ్, ఉపేంద్ర, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నందలూరు మండలం ఇసుకపల్లెలో కల్యాణ మహోత్సవం



శ్రీసీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



పెనగలూరు మండలం రాజుపాలెంలో



గాలివీడు: పెద్దూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవం

పేదల ఆర్థికాభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

చిట్వేలి : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమైందని, మరలా ముఖ్యమంత్రిగా జగనన్న వస్తేనే ప్రజా సంక్షేమం, పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం రాజుకుంట, సాయంత్రం చెర్లోపల్లి అరుంధతివాడ, ఎస్టీ కాలనీల్లో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి జగనన్న పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి ద్వారా జరిగిన లబ్ధిని ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులపై పూలు చల్లుతూ, బాణసంచా పేల్చుతూ, డప్పువాయిద్యాలతో గ్రామస్తులు స్వాగతం పలికారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు అండగా నిలవాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను, ఎంపీ అభ్యర్థిగా మిథున్‌రెడ్డి పోటీలు ఉన్నామని, ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని తెలియజేశారు. చంద్రబాబు అసత్య వాగ్దానాలను ప్రజలు విశ్వసించవద్దని ఓటర్లకు చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌వీ మోహన్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ మలిశెట్టి వెంకటరమణ, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్ రాజు, ఎంపీపీ చంద్ర, భాస్కర్‌రెడ్డి, బి.రమణారెడ్డి, లింగం లక్ష్మీకర్, శివారెడ్డి, వేదవ్యాస్, వేణు, రాముడు, సుబ్బరాయుడు, సర్పంచ్‌లు ఈశ్వరయ్య, బాలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి జరిగిన లబ్ధిని మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల, తదితరులు

సంక్షేమం అందాలంటే జగనే రావాలి

ఓబులవారిపల్లె : సంక్షేమ పథకాలు కొనసాగలంటే మళ్లీ సీఎంగా జగనే రావాలని ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దఓరంపాడు పంచాయతీలో ఆయన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పంచాయతీ పరిధిలోని గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి రైల్వేకోడూరు ఎమ్మెల్యేగా కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ జి.గౌరిశంకర్‌రాజు, సర్పంచ్‌లు నారాయణ రెడ్డి, పాపిరెడ్డి, ఆళ్ల ఈశ్వరయ్య, ఎం. ఈశ్వరయ్య, ఎన్.వెంకటసుబ్బారెడ్డి, ఎంపీటీసీ రోహిణికుమార్ రెడ్డి, ప్రతాప్, కె.నారాయణరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మళ్లీ పట్టం కట్టండి

రైల్వేకోడూరు : సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, సీనియర్ నాయకులు కొరెడ్డి సిద్దయ్య పేర్కొన్నారు. బుధవారం కుక్కలదొడ్డి పంచాయతీలో పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కొరముట్లను, ఎంపీ అభ్యర్థి మిథున్‌రెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి

లక్కిరెడ్డిపల్లె : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రెడ్డప్పగారి రమేష్ కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గడికోట సుదీప్‌కుమార్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు ఎం.సుదర్శన్ రెడ్డిలు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దప్పేపల్లి గ్రామంలోని మేడిమాకుల గుంత గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డిని, రాయచోటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గడికోట శ్రీకాంత్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని వారు ఓటర్లను అభ్యర్థించారుఏ ఇంటికి వెళ్లినా జగనన్నే మా దేవుడు అంటూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి జగనన్న అని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీపీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడిన ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిని అఖండమైన మెజార్టీతో గెలిపించాలన్నారు. మాజీ ఎంపీపీ రెడ్డయ్య, ఉమాపతి రెడ్డిలు మాట్లాడుతూ పేద ప్రజల ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుమారస్వామిరెడ్డి, గడికోట ప్రభాకర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, సింగల్‌విండో అధ్యక్షులు ఎర్రంరెడ్డి, ఎస్.రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, గజేంద్రరెడ్డి, రవిరాజు, ఎంపీటీసీ పోల్ రెడ్డి సుబ్బారెడ్డి, శ్రీరాములు, లక్ష్మినారాయణ, జగన్‌మోహన్ రెడ్డి, శంకర్ నాయుడు, గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్ నరసింహారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డిలు

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ



లక్కిరెడ్డిపల్లె: అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సుదర్శన్ రెడ్డి



రాజంపేట రూరల్: అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారులు

లక్కిరెడ్డిపల్లె : గ్యాస్ సిలిండర్ ద్వారా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా బయటపడాలో అనే విషయంపై మండలంలోని లక్కిరెడ్డిపల్లె టౌన్‌లో మహిళలకు అగ్ని ప్రమాదాలపై బుధవారం అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా నాల్గవరోజు టౌన్ పరిధిలో వివిధ ప్రాంతాలలో అగ్నిమాపక ఇన్‌చార్జ్ అధికారి సుదర్శన్ రెడ్డి తన సిబ్బందితో మహిళలకు పలు విన్యాసాలు ద్వారా ప్రమాదాలు సంభవిస్తే వాటి నుంచి బయటపడే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజలకు అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ ప్రమాదాలపై అవగాహన కలిగి ఉంటే ప్రమాదాల నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు.

రాజంపేట రూరల్ : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా 4వ రోజు అయిన బుధవారం మండల పరిధిలోని కె.బోయనపల్లిలో అగ్నిమాపక కేంద్ర అధికారి కె.మాబుసుభాన్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ద్వారా అగ్నిప్రమాదాలు జరిగితే ఎలా నివారించాలో ప్రజలు చేత చేయించి అవగాహన కల్పించారు. గ్యాస్ మండుతున్నప్పుడు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరిస్తూ మంటలను ఏ విధంగా ఆర్పి వేయాలో వివరించారు. ప్రమాదాలు జరిగిన సమయంలో మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలో వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎల్ఎఫ్ బి.శివయ్య, ఎల్ఎఫ్‌బీసీఆర్ సుబ్రమణ్యం, డ్రైవర్/ఆపరేటర్‌లు డి.శివయ్య, సి.నాగూర్‌బాషా, ఎఫ్ఎంలు ఎస్.వెంకటసుబ్బయ్య, కె.రాజేశ్వర్, హెచ్‌జీలు యు.రాజన్న, జి.చక్రవర్తి, సి.రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాల నివారణ

రాయచోటి టౌన్ : ముందు జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారి వెంకట్రామిరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం రాయచోటి పట్టణంలో పెట్రోల్, డీజిల్ సెంటర్లలో ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయనే విషయాలపై వివరించి చెప్పుతూ ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎలాంటి జాగ్రత్తలు పాటిస్తే అగ్నిప్రమాదాలను నివారించుకోవచ్చుననే విషయాలను తెలియచేసే కరపత్రాలను పంపిణీ చేశారు. అంతకుముందు ఫైర్ స్టేషన్ పరిధిలోని ప్రజలతో కరపత్రాలను విడుదల చేశారు.

నామినేషన్ల పర్వానికి సర్వం సిద్ధం

రాజంపేట : రాజంపేట అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్ల పర్వానికి సర్వం సిద్ధం చేశారు. బుధవారం సబ్ కలెక్టరేట్ ఆవరణలోని సభా భవనంలో నామినేషన్‌ల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో సబ్ కలెక్టర్ చాంబరులోనే నామినేషన్లను స్వీకరించేవారు. ప్రస్తుతం ఆర్‌ఓ మోహనరావు నామినేషన్ల స్వీకరణకు చాంబరు అనువుగా లేదని, సభా భవనాన్ని పునరుద్ధరణ చేయించారు. అసిస్టెంట్ రిట్నరింగ్ ఆఫీసర్లు, ఎన్నికల సిబ్బందితోపాటు పలువురు రెవెన్యూ అధికారులు ఆర్‌ఓకు అందుబాటులో ఉండేలా డెస్క్‌లు, కంప్యూటరింగ్, క్లర్క్ సైడ్ వర్క్, మీడియా సెల్‌ను ఏర్పాటు చేశారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా వంద మీటర్ల వరకు ఎవరిని అనుమతించమని, 200 మీటర్ల దూరంలో వాహనాలను ఆపివేయడం జరుగుతుందని, అభ్యర్థితోపాటు నలుగురుకు అనుమతి ఉంటుంది వెల్లడించారు. రాజంపేట డీఎస్పీ చైతన్య నేతృత్వంలో టౌన్, రూరల్ సీఐల పర్యవేక్షణలో బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఎన్నికల సంఘం ఆదేశం మేరకు ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకే నామినేషన్ల స్వీకరణ ఉంటుందని రాజంపేట ఆర్‌ఓ మోహనరావు తెలిపారు. గురువారం నుంచి ప్రారంభమయ్యే నామినేషన్ స్వీకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం సబ్‌కలెక్టరేట్ సభా భవనంలో రాజంపేట ఆర్‌ఓ టి.మోహనరావు ట్రైల్ రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది పలు సూచనలు చేశారు.

సామాజిక న్యాయాన్ని చేసి చూపించాడు

రాజంపేట : సామాజిక న్యాయమంటే ఏమిటో చేసి చూపించిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని ఉత్తర అమెరికా ఏపీ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి పండుగాయల రత్నాకర్ అన్నారు. బుధవారం నందలూరులో అరిగె కాంప్లెక్స్‌లో సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఎంపీ అభ్యర్థి పీవీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఏ.అమరనాథరెడ్డి మెజార్టీతో గెలుపే లక్ష్యంగా బలిజ సామాజికవర్గ నేతలతో ఆయన భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం నాలుగున్నరేళ్ల పాలనలో అనేక మంది కాపు నేతలకు కీలకమైన పదవులను కేటాయించారన్నారు. 10 మంది కాపు నేతలకు మంత్రి పదవులను ఇచ్చారన్నారు. రాబోయే రోజుల్లో కాపు, బలిజ సామాజికవర్గానికి చెందిన వారికి మరింత రాజకీయ ప్రాధాన్యత ఇచ్చేందుకు సీఎం జగన్ కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించడంలో బలిజలు కీలకపాత్ర వహించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కాపునేతలు అరిగెల సామిత్రి, అరిగెసోదరులు హరిబాబు, మణి, కొర్లకుంట సుబ్బరామయ్య, మండెం సుబ్బు, మండెం రాము, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



కాపునేతలతో చర్చిస్తున్న రత్నాకర్